




జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న గణసత్యనారాయణ

గోదావరి వరద పెరుగుతుండడంతో కోనసీమలోని లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయగా ధవళేశ్వరం వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దాంతో కోనసీమలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలు పొంగి ప్రవహించడం వల్ల సమీపంలోని లంక గ్రామాల్లోకి వరదనీరు చేరుతోంది. గురువారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో వరద ఉధృతి మరింత పెరిగింది. లంక గ్రామాలకు ముంపు ముప్పు వచ్చి పడింది. అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.


టెన్షన్‌గా..

వరద ముప్పుతో భయం భయం

- కోనసీమలో పెరుగుతున్న వరద
- లంక గ్రామాలకు చేరుతున్న వరదనీరు
- మునుగుతున్న కాజ్‌వేలు..
- బలహీన గట్ల వద్ద చర్యలు చేపట్టాలి
- : కలెక్టర్ మహేష్‌కుమార్



పి.గన్నవరం: కనకాయలంక కాజ్‌వే పై పడవపై రాకపోకలు



అయినవిల్లి: ముక్తేశ్వరం వద్ద నీట మునిగిన పాత వంతెన

ధవళేశ్వరం వద్ద 1 మొదటి ప్రమాద హెచ్చరిక

వార్త..7లో



● ముమ్మిడివరం సోమిదేవర పాలెంలో ముంపు



●(ముమ్మిడివరం) అయినాపురంలో నీట మునిగిన వరి పొలాలు

● (అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు రహదారి అయిన కనకాయలంక-చాకలిపాలెం కాజ్‌వే నీట మునిగి రవాణా సౌకర్యాలకు ఆటంకం కలుగుతుంది. వీటితో పాటు నదీపరివాహక ప్రాంతాల్లో ఉన్న పలు పల్లపు కాజ్‌వేలు వరద నీటిలో మునిగాయి. మరికొన్ని కాజ్‌వేలపైకి నీరు చేరుతుంది. ముఖ్యంగా వివిధ మండలాల పరిధిలో ఉన్న 30కి పైగా ఉన్న లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టారు. ఎక్కడికక్కడే పడవలపై లైఫ్‌జాకెట్లు సాయంతో ప్రయాణికులను దాటించడంతో పాటు ఇతర జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నారు. అయినవిల్లి ఎదురుబిడియం వద్ద వరద నీరు కాజ్‌వే పై ప్రవహిస్తుంది. మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో తీర ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముక్తేశ్వరంలో పాత వంతెన నీట మునిగింది. అప్పనపల్లి కాజ్‌వే వద్ద ఉన్న ఇటుక బట్టీలు వరద ప్రవాహంలో మునిగాయి. వరద కాజ్‌వేపైకి చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులతో పాటు మండల స్థాయిలో ఉన్న అధికారుల బృందాలు విస్తృతంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పెరుగుతున్న వరద పరిస్థితిని పరిశీలించారు. రాగల రెండు రోజుల్లో వరద పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజాప్రతినిధులు ప్రజలను కోరుతున్నారు. వరద పెరుగుదల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా గోదావరి నదీపరివాహక ప్రాంతాల్లో ఉన్న ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల వద్ద రక్షణ చర్యలు చేపట్టడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను బలహీన గట్ల వద్ద నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం వద్ద వరద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పడవలపైనే రాకపోకలు

పి.గన్నవరం, సెప్టెంబరు 5: చాకలిపాలెం వద్ద కాజ్‌వే పూర్తిగా నీటమునగడంతో లంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంక గ్రామాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు సరిహద్దు గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతి పెరగడంతో బూరుగులంక నదీపాయను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. పడవపై ప్రయాణించే ప్రతి వ్యక్తికి లైఫ్ జాకెట్టు తప్పనిసరిగా ఉండాలని లేనివారిని పడవ దాటించొద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయ సిబ్బందికి సూచించారు. వరద ఉధృతి పెరిగితే సంబంధిత గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవి, సీఐ ప్రశాంత్‌కుమార్ బూరుగులంక నదీపాయను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ముంపులో వరి పొలాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 5: గోదావరి వరద నీటిమట్టం పెరగడంతో వృద్ధ గౌతమీ, అయినాపురం అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు మూసివేశారు. బొబ్బర్లంక-అయినాపురం పంటకాల్వ సర్‌ప్లస్ వియర్ నుంచి మిగులు జలాలను అయినాపురం మురుగుకాల్వలోకి ఎగదన్నడంతో మురుగు కాల్వల వెంబడి ఉన్న 450 ఎకరాలు, సోమిదేవరపాలెంలో 200 ఎకరాలు, కొత్తలంకలో 200 ఎకరాలు, సీహెచ్ గున్నేపల్లి, అనాతవరం గ్రామాల్లో మురుగు కాల్వల పక్కన ఉన్న పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. గోదావరికి వరదలు రావడం స్లూయిస్ షట్టర్లు మూసివేయడంతో మురుగుకాల్వల వెంబడి ఉన్న వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. లంకాఫ్‌ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక తదితర లంక ప్రాంతాల్లో లోతట్టు భూముల్లోకి వరద నీరు చేరింది. తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మీ లంక గ్రామాల్లో పర్యటించి వీఆర్వోలను అప్రమత్తం చేశారు. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్‌ఠాణేలంక రైతులు పాలు తీసుకువచ్చేందుకు, పొలాలకు వెళ్లేందుకు మూడు మెకనైజ్డ్ బోట్లను ఏర్పాటుచేశారు.

దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఉపాధ్యాయులే

- ● కలెక్టర్ మహేష్‌కుమార్
- ● కలెక్టరేట్‌లో ఘనంగా గురుపూజోత్సవం



సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఉపాధ్యాయులేనని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. భావి భారత పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యారంగంలో చేసిన సంస్కరణల ప్రభావం తెలియాలంటే 20 ఏళ్లు పడుతుందన్నారు. 400 ఏళ్లకాలంలో దేశంలోని విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులను వివరించారు. ఉపాధ్యాయులే పిల్లలకు అవసరమైనవి నేర్పే విధంగా విద్యా వ్యవస్థలో మార్పులు రావాలన్నారు. జిల్లాలో ప్రతీ ఏటా విద్యార్థులకు స్పోర్ట్స్ డే నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా వృత్తి ఔన్నత్యాన్ని నిలబెట్టాలని, బుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు దారి తప్పితే సమాజం క్షమించదని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా విద్యాబోధన సాగాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన 42 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, గెద్దం సంపదరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, తోట రవి, ఎంఎకే భీమారావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకుంటున్న కూర్మా సత్యవిజయలక్ష్మి

గురువులకు వందనం

జిల్లా వ్యాప్తంగా ఘనంగా గురుపూజోత్సవం

ఉపాధ్యాయులకు సత్కారం 8





ఇన్‌సెట్‌లో కాలిన రథం (ఫైల్)

నిమజ్జనం కోసం వేయి కళ్లతో..

భక్తుల మనోభావాలు పట్టించుకునేవారేరి?

అంతర్వేది, సెప్టెంబరు 5: దక్షిణకాశీగా పేరొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన రథం నాలుగు సంవత్సరాల క్రితం సెప్టెంబరు 5వ తేదీ అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. షెడ్డులో రథం అగ్నికి ఆహుతి అవుతుంటే భక్తులు స్వామివారి పురాతన రథం దగ్ధమవుతున్న దృశ్యాలు చూసి కన్నీటి పర్యవంతమయ్యారు. గత ప్రభుత్వం నూతన రథాన్ని సిద్ధం చేసినా, అగ్నికి ఆహుతి అయిన రథాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీబీఐ దర్యాప్తు ఇంత వరకు ఓ కొలిక్కి రాకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాలిన రథం శిథిలాలను నిమజ్జనం చేయడం కోసం దేవదాయశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు ఎప్పుడు ఫలిస్తాయోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శిథిలమైన రథం షెడ్డును తాత్కాలికంగా రేకులతో మూసివేశారు. గత ప్రభుత్వం చేయలేక గాలికొదిలేసిన రథం నిమజ్జనంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించాలని విశ్వహిందూ పరిషత్, పలు ఆధ్యాత్మిక సంఘాలు కోరుతున్నాయి. దీనిపై ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల అనుమతి వచ్చిన వెంటనే నిమజ్జన కార్యక్రమం చేపట్టి సంప్రోక్షణ చేస్తామని చెప్పారు. వారి అనుమతులు కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు.



కొబ్బరి రైతుల్లో ఉత్సాహం

ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం... మన ప్రాంతంలో దిగుబడులు అంతంతమాత్రంగా ఉండటం.. వరుస పండుగలు రావడంతో కొబ్బరిమార్కెట్లలో ధరలు ఊపందుకున్నాయి. గత ఏడాది నుంచి నష్టాలతో ఇబ్బందులు పడుతున్న కొబ్బరి రైతుల్లో ధరల పెరుగుదలతో ఉత్సాహం నెలకొంది. గత ఏడాది పచ్చికాయల వెయ్యింటికి ప్రస్తుతం రూ.12 వేలు ధర పలుకుతుంది. దీంతో ఉభయరాష్ట్రాల నుంచి ఎగుమతులు ఊపందుకున్నాయి.


అంబాజీపేట, సెప్టెంబరు 5:



పండుగే..పండుగ

శ్రావణ మాసం పూర్తికావడంతో పాటు వినాయక చవితి, దసరా, దీపావళి వరుస పండుగలు రావడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు అధికంగా వస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో దిగుబడలు లేకపోవడంతో మన ప్రాంతాలలో ఉన్న కొబ్బరిని కొనుగోలు చేసేందుకు విముఖత చూపుతున్నారు. వినాయక చవితి సందర్భంగా బీహార్, మహారాష్ట్ర, జార్ఖండ్, కోల్‌కతా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు అధికంగా అవుతున్నాయి. బీహార్ రాష్ట్రంలో విశ్వకర్మ పూజను అక్కడి ప్రజలు వైభవంగా నిర్వహిస్తారు. అక్కడ ప్రతి ఒక్కరూ కొబ్బరికాయలను దేవుడికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే దశమి సందర్భంగా ఆయా ప్రాంతాలకు ఎగుమతులు అధికంగా అవుతున్నాయి. దీపావళి అనంతరం నాగులచవితి సందర్భంగా బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఛట్ పూజను నాలుగురోజుల పాటు నిర్వహిస్తారు. అక్కడ ప్రజలు పూజ అనంతరం నదులలో కొబ్బరికాయలను వదులుతారు. దీంతో ఉభయగోదావరి జిల్లాల నుంచి రోజుకు 70 నుంచి 80 లారీలకు పైగా ఎగుమతులు జరుగుతున్నాయి. అలాగే భక్తుల మాలధారణలు, కార్తీక మాసం సందర్భంగా మార్కెట్‌లో కొబ్బరి ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని కొబ్బరి వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ధరల పెరుగుదలతో ఆనందం





అంబాజీపేట నుంచి కొబ్బరి ఎగుమతులు చేస్తున్న కార్మికులు

గతంలో లేని ధరలు..ఆర్డర్లు

తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలో అధికంగా కొబ్బరి దిగుబడులు రావడంతో పాటు అక్కడ నాణ్యత ఉండటంతో మన రాష్ట్రానికి ఆర్డర్లు తక్కువగా వచ్చేవి. అయితే ఆయా రాష్ట్రాలలో దిగుబడులు తగ్గడంతో మన గోదావరి జిల్లాలకు అధికంగా ఆర్డర్లు వస్తున్నాయి. గత ఏడాది పచ్చికొబ్బరికాయల ధరలు వెయ్యింటికి రూ.9 వేల నుంచి రూ.9,500 ధర ఉండగా ప్రస్తుతం పచ్చికొబ్బరికాయల ధర వెయ్యింటికి రూ.11,500 నుంచి రూ.12 వేలు పలుకుతుంది. అయితే మన ప్రాంతంలోను దిగుబడి అంతంతమాత్రంగా ఉండటంతో రైతులు కొంత నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. అధిక పెట్టుబడులు పెట్టినప్పటికి తెల్లదోమ, తెగుళ్ల కారణంగా దిగుబడి రావడంలేదు. ఎకరాకు 800 నుంచి 900 దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 200 నుంచి 300 కొబ్బరికాయలు మాత్రమే దిగుబడి వస్తోంది.

- ఊపందుకున్న ఎగుమతులు
- కలిసివచ్చిన వరుస పండుగలు
- పచ్చికొబ్బరికాయలకు రికార్డు ధర

పెరిగిన నూనె ధర



కొబ్బరి ధరలు పెరగడంతో నూనె ధరలు భారీగా పెరిగాయి. నాఫెడ్ కేంద్రాలు ప్రారంభించడంతో పాటు ఇతర ప్రాంతాలకు కొబ్బరి ఎగుమతులు అధికంగా పెరగడంతో ఆ ప్రభావం నూనె ధరలపై పడ్డాయి. గతంలో 15 కేజీల ఆయిల్ డబ్బా రూ.1600 నుంచి రూ.1800 ఉండగా కొబ్బరి ధరలు పెరగడంతో 15 కేజీల ఆయిల్ డబ్బా ధర రూ.2200 నుంచి రూ.2,500 పలుకుతుంది. ఈ నూనెను సబ్బుల తయారీతో పాటు ఇతర రాష్ట్రాల్లో వంటలలో వినియోగిస్తారు. అంబాజీపేట నుంచి నిత్యం ఆయిల్‌ను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.


ఎంపీ హరీష్ రూ.5 లక్షల విరాళం



లోకేశ్‌కు విరాళం చెక్ అందిస్తున్న ఎంపీ హరీష్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి రూ.5లక్షల చెక్కును హరీష్‌మాధుర్ అందజేశారు. కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్ సాయం రూ.2 లక్షలు



చెక్ అందిస్తున్న సాత్విక్ తల్లిదండ్రులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5: ముఖ్యమంత్రి సహాయనిధికి అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్ రూ.2లక్షల విరాళాన్ని అందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2లక్షల విరాళం చెక్కును సాత్విక్‌సాయిరాజ్ తల్లిదండ్రులు రంగమణి-కాశీవిశ్వనాథ్ దంపతులు కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి చెక్కును అందజేశారు.

14న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగలలోని కోర్టుల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నసివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటికేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు.

65 ఏళ్లుగా మట్టి గణపతే

డఫేదారు నూతి సెంటర్లో ఉత్సవాల ప్రత్యేకత



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: రామచంద్రపురం పట్టణంలోని డఫేదారు నూతి సెంటర్లో గణపతి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. 1960 నుంచీ బాలభక్త సమాజం ఇక్కడ మట్టి గణపతిని మాత్రమే ప్రతిష్ఠించి పూజలు చేస్తోంది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు నీతూకుమారి ప్రసాద్ రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు అందజేశారు. 2009లో స్వర్ణోత్సవాలు, 2019లో షష్టి పూర్తి మహోత్సవాలు జరిపారు. తాపేశ్వరం సురుచి స్వీట్స్ అధినేత మల్లిబాబు 50 ఏళ్లుగా ఏడాదికి కిలో వంతున పెంచుతూ లడ్డూ అందజేస్తున్నారు. ఈ ఏడాది 65 కిలోల లడ్డూ అందజేయనున్నారు.

2009లో స్వర్ణోత్సవాల అనంతరం గణపతి మాలధారణ చేసిన భక్తులు చవితి ఉత్సవాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 20 మంది భక్తులు గణపతి మాలధారణ చేశారు. అన్నదానం కూడా జరపనున్నారు. భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బాలభక్త సమాజం సభ్యులు చెప్పారు.

నారికేళ ప్రియుడు అయినవిల్లి సిద్ధి వినాయకుడు



అయినవిల్లి, సెప్టెంబరు 5: సకల దేవతా గణాలకు అధిపతి, విఘ్నాలను తొలగించే విఘ్నాధిపతి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి. ఒక్క నారికేళం సమర్పించినంతనే కోరిన కోర్కెలు తీర్చే స్వామి సిద్ధి వినాయకుడు. స్వయంభువుగా వెలసిన గణపతి క్షేత్రాల్లో ప్రత్యేకత గల ఆలయం ఇది. గోదావరి, గౌతమి తీరాన పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటల నడుమ అందాల కోనసీమలో అయినవిల్లి గ్రామంలో కొలువైయున్నాడు ఈ స్వామి. స్వర్ణ గణపతి యజ్ఞం నుంచి ఉద్భవించి దక్షిణాభిముఖుడిగా తూర్పు వైపునకు తొండము తిరిగి, తొండముతో వామహస్తమున మోదకము, దక్షిణ హస్తమున అభయస్త ముద్రతో చూడముచ్చటైన ఉదరముతోభక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. అతి చిన్న ప్రాంగణం, నాలుగు మాడ వీధులు, ప్రాకార మండపం, తూర్పు, దక్షిణ రాజగోపురాలతో చూడచక్కని అందాలతో అలరారుతోందీ క్షేత్రం. దక్ష ప్రజాపతి యజ్ఞ ప్రారంభంలో విఘ్నేశ్వర స్వామి ఆరాధన చేయకుండా శివేశ్వర యాగం ప్రారంభించినందుకు శివుని ఆగ్రహానికి గురై యజ్ఞ భంగం జరిగింది. యజ్ఞభంగం కలగడం మానవాళికి మంచిదికాదని దేవతలు మహావిష్ణువును ప్రార్థించగా దేవతల సూచనల మేరకు దక్ష ప్రజాపతి అయినవిల్లి స్వయంభు గణపతి క్షేత్రానికి విచ్చేసి గణపతి ఆరాధన చేసి తదుపరి యజ్ఞం పూర్తి చేసినట్టు పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి.

ఇసుకతో వినాయకుడు...



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాల నాగేశ్వరరావు ఇసుకతో చిన్న సైజు వినాయకుడిని చేశాడు. గోదావరిలో సేకరించిన ఇసుకకు తేనె పట్టు, మైనం జత చేసి దారంతో పాటు వెదురుబద్దలను ఉపయోగించి సుమారు ఏడు గంటల పాటు శ్రమించి గణపతిని తయారు చేశాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన విగ్రహాలు వద్దు... మట్టి విగ్రహాలే ముద్దు అని... అందుకే తాను ఇసుకతో విగ్రహం తయారు చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు.

\- మండపేట

చెవిలో చెబితే చాలు కోర్కెలు తీర్చే

బిక్కవోలు వినాయకుడు



బిక్కవోలు, సెప్టెంబరు 5: ప్రాచీన ఆలయాలకు పుట్టినిల్లుగా భాసిల్లే బిక్కవోలులో ఆది దేవునిగా భక్తుల పూజలందుకుంటున్నాడు స్వయంభూ వినాయకుడు. ఈ స్వామి చెవిలో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పంట పొలాల్లో ఈ వినాయకుని విగ్రహం బయల్పడింది. 9వ దశాబ్దానికి చెందిన ఏకశిల విగ్రహమని పురావస్తు శాఖ పరిశీలనలో వెల్లడైంది. పశ్చిమ చాళుక్యుల తర్వాత బిక్కవోలును రాజధానిగా చేసుకుని 9వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పాలించారు. వారు యుద్ధాలకు వెళ్లే ముందు ఈ వినాయకుడికి పూజలు చేసి వెళ్లి విజయం సాధించేవారు. కాలక్రమేణా తురుష్కులు, పిండారీలు, మహ్మదీయుల దండయాత్రల్లో ఈ విగ్రహం భూమిలోకి కూరుకుపోయిందన్న ప్రచారం కూడా వాడుకలో వుంది. అయితే 1960 దశకంలో బిక్కవోలుకు చెందిన ఒక భక్తుని కలలో వినాయకుడు కనిపించి తన ఉనికిని తెలిపాడని ప్రతీతి. నిరుపేద అయిన ఆ భక్తుడు గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేయగా.... ఎంత తవ్వినా విగ్రహం మొదలు కానరాలేదు. దీంతో అలాగే భక్తులు స్వామిని పూజించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం విగ్రహం పది అడుగుల ఎత్తు, ఆరడగుల వెడల్పు వుంది. ఈ స్వామికి తొండం కుడివైపునకు వుండడంతో భక్తుల మనసులోని ఏ కోరికనైనా స్వామికి చెవిలో చెబితే తప్పక నెరవేరుతుందని విశ్వాసం.

చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు: సాయిబాబారెడ్డి



ఈ ఏడాది వినాయకచవితి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు వేశామని, వర్షం వచ్చినా భక్తులు తడవకుండా పందిళ్లపై రేకు షెడ్డు నిర్మించామన్నారు. స్వామి దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రాత్రి 1.59 గంటలకు తీర్థపు బిందె సేవ నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 7వ తేదీ ఉదయం 10.29 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి-మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 16 వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని, వచ్చే భక్తులందరికీ అన్నదాన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 16న మహాన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామని వివరించారు. వినాయకచవితి సందర్భంగా ఆలయంలో ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు ప్రతిరోజూ శ్రీలక్ష్మీ గణపతి స్వామి మూలమంత్ర, జపతర్పణ నిర్వహిస్తామని అర్చకుడు గొల్లపల్లి చలపతిశర్మ చెప్పారు.

నేడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సమావేశం

స్థాయీ సంఘాల సమావేశాలు కూడా

భారీ వర్షాలు, వరదలే అజెండా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ పాలకవర్గం శుక్రవారం కొలువుదీరనుంది. ఉదయం 10.30 గంటల నుంచి కాకినాడ లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గల జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లాను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలపైనే ప్రధాన అజెండాగా చర్చ జరగనుంది. సమావేశంలో చర్చించేందుకు 41 శాఖలకు చెందిన అంశాలతో అజెండాను రూపొందించారు. ప్రధానంగా ఇరిగేషన్, రోడ్లు మీద గట్టిగా పట్టుబట్టడానికి జడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. పాడేరు, కోనసీమ జిల్లాల నుంచి జడ్పీటీసీలు ఎంతో వ్యయప్రయాసలతో సమావేశాలకు వస్తున్నారు. ప్రతి సమావేశంలోనూ వారి పరిధిలోని సమస్యలను ఏకరువు పెడుతున్నారు. నిధుల లేమి, కొందరు అధికారుల అలసత్వం వల్ల ఎటువంటి పనులూ జరగట్లేదని వాపోతున్నారు. స్వపక్షంలోనే విపక్షంగా జడ్పీటీసీలు గళం విప్పిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నైనా నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నారు. ఒకానొక సందర్భంలో జడ్పీకి రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు విడుదల కాక పదవుల్లో ఎందుకు ఉన్నామా అనే అసహనం కూడా జడ్పీటీసీలు వ్యక్తం చేశారు. నిధులు లేక 20 నెలలకు పైగా గౌరవవేతనం చెల్లించలేని పరిస్థితిలో జడ్పీ కొట్టుమిట్టాడుతోంది. వీటన్నిటినీ కూటమి పాలకుల ముందుంచను న్నారు. అజెండాలో పొందుపరిచిన వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, జలవనరులు, మైక్రో ఇరిగేషన్, గృహ నిర్మాణం అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది.



వరద బాధితులకు భరోసా

రూ.11 లక్షలు విలువైన ఆహార పదార్థాలు అందజేసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 5: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఉదయం సహాయక చర్యలు చేపట్టారు. రామచంద్రపురం నుంచి బుధవారం రాత్రి రూ.11 లక్షలు విలువ చేసే వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింకులు, టోన్డ్ పాల ప్యాకెట్లు, బేకరీ బన్నులు తీసుకువెళ్లారు. తనకు కేటాయించిన చిట్టినగర్, 33, 47. 64 డివిజన్లలో మంత్రి సుభాష్‌కు పర్యటించి ఆహార పదార్థాలను అందజేశారు. బాధితులను పరామర్శించి భరోసా కల్పించారు. సీఎం రేయింబవళ్లు కష్టపడుతున్నారని, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పలువురు ఉన్నారు.

చిట్టినగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

వరద బాధితులకు ఒక్కరోజు అమ్మకాల మొత్తం విరాళం

'సురుచి' యజమాని మల్లిబాబు

మండపేట, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సురుచి సంస్థ యజమాని పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) ముందుకొచ్చారు. ఈ నెల 8వ తేదీన ఉభయ గోదావరి జిల్లాల్లో వున్న తమ ఏడు బ్రాంచిల్లో విక్రయాల ద్వారా వచ్చే మొత్తాన్ని సీఎం సహాయ నిధికి అందజేస్తామన్నారు. ఆదివారం వినియోగదారులు తమ సంస్థల్లో అధికంగా స్వీట్లు కొనుగోలు చేసి వరద బాధితుల సహాయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'కృష్ణా బాధితులకు గోదావరి సాయం' పేరుతో ఈ సాయం అందించాలని నిర్ణయించినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో కేరళలో తుఫాన్ సమయంలో తమ సంస్థ తరపున రూ.6లక్షలు విరాళం అందించామన్నారు. ఇప్పుడు విజయవాడ బాధితులకు బ్రెడ్, జామ్, పచ్చళ్లు అందించామన్నారు.

కిమ్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ

▸▸ కిలో బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు అపహరణ ▸▸ రంగంలోకి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5: అనుక్షణం జన సంచారం ఉంటుంది. చుట్టూ సీసీ కెమెరాల నిఘా. అవుట్‌గేట్, ఇన్‌గేట్ వద్ద ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బంది. అయినప్పటికీ దర్జాగా దొంగలు లోపలికి వచ్చి వేంకటేశ్వరస్వామి ఆభరణాలను అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కామనగరువు పంచాయతీ పరిధిలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. గురువారం ఉదయం ఆలయం వద్దకు వచ్చిన అర్చకుడు వేదాంతం కేశవరామ్ తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. చోరీ జరిగినట్టు భావించి ఆసుపత్రి యాజమాన్యానికి సమాచారం అందించాడు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) నిర్మించారు. స్వామివారికి రూ.20.50 లక్షల విలువైన కిలో బంగారు, రెండు కిలోల వెండి ఆభరణాలను అలంకరించారు. చోరులు చాకచక్యంగా ఆలయ ప్రధాన ద్వారం తాళం తెరిచి దర్జాగా లోనికి వెళ్లి స్వామివారి ఆభరణాలను అపహరించారు. బయట ఉన్న స్వామివారి హుండీని పెకిలించి అక్కడికి సమీపంలోని కొంతదూరం తీసుకువెళ్లి దానిని పగులకొట్టి ఆసొమ్ములను కూడా అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. అర్చకుడు కేశవరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.





వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద క్లూస్ టీమ్ పరిశీలన... చోరీ జరిగిన విధానాన్ని పరిశీలిస్తున్న తాలూకా సీఐ వీరబాబు



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

ఉధృతంగా గోదావరి

▸▸ ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

▸▸ 10.04,528 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, సెప్టెంబరు 5: ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం ఉదయానికి నీటిమట్టం 10.60 అడుగుల వరకు చేరుకోగా 8.36 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరంవద్ద వద్ద గంటకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతున్న నీటిమట్టం గురువారం రాత్రి పదకొండు గంటలకు 11.9 అడుగులుగా నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 10,04,528 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఎగువన ఎస్ఆర్ఎస్పీ, కడెం, శ్రీపాద, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి మిగులు నీటిని విడుదల చేయడం వల్ల కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తుండడంతో పాటు తాలిపేరు నుంచి విడుదలైన వరద నీటితో మరలా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతూ గురువారం సాయంత్రం ఐదు గంటలకు 45.50 అడుగులకు చేరుకుంది. ఆపై తగ్గుతూ రాత్రి 11 గంటలకు 44 అడుగులుగా నమోదైంది.

అయినవిల్లి సిద్ధి వినాయకుని హుండీల ఆదాయం రూ.15.07 లక్షలు



అయినవిల్లి, సెప్టెంబరు 5: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 41 రోజులకు ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.14,60,055, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.47,061... మొత్తం రూ.15,07,116 వచ్చింది. లెక్కింపులో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా కానిది... రెండు రోజుల్లో

సింగంపల్లిలో వినియోగంలోకి ఆర్వో ప్లాంటు



ఆర్వో ప్లాంటు వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 5: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలోని సింగంపల్లి గ్రామస్తుల తాగునీటి సమస్యపై 'వరద నీరే... తాగు నీరై' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెండేళ్లుగా పని చేయని ఆర్వో ప్లాంటుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. తంటికొండ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు రెండు రోజులు గ్రామంలోనే దగ్గరుండి బాగు చేయించారు. దీంతో గ్రామస్తులు గురువారం సాయంత్రం ఆర్వో ప్లాంటు వద్ద తాగునీటిని పట్టుకున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు దారుణం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: మండపేట మండలం ద్వారపూడిలో దళితులు, ముస్లింలు కలిసి ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం చాలా దారుణమని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎల్‌బీ శాస్త్రి రోడ్డులోని నివాసంలో పోలీసులు తనను గృహ నిర్బంధం చేయడంపై ఆయన మండిపడ్డారు. అనంతరం హర్షకుమార్ విలేకరులతో మాట్లాడారు. ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే దానిని స్పెషల్ పార్టీ పోలీసులు తొలగించడం దారుణమన్నారు. విగ్రహం తొలగింపును వ్యతిరేకించిన మాల, మాదిగలపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. లాఠీచార్జిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు బయల్దేరిన తనను గృహ నిర్బంధం చేయడం తగదన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి నిలబెట్టాలని డిమాండ్ చేశారు.

తండ్రి కళ్లెదుటే ఘోరం

టాటా ఏస్ వ్యాను ఢీకొని రెండేళ్ల బాలుడు మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం తాడిపూడిలో వ్యాను ఢీకొనడంతో రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపూడి గ్రామానికి చెందిన ఇర్లపాటి నరేష్ టెంట్‌హౌస్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం అతడి వద్ద పనిచేసే గూడపాటి బాబి సప్లై సామాన్లు తీసుకువెళ్లడానికి టాటా ఏస్ వ్యానుతో వచ్చాడు. అక్కడే ఆడుకుంటున్న నరేష్ కుమారుడు లాశ్విక్ (2)ను వ్యాను ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నరేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు లాశ్విక్ కళ్లెదుటే మృతి చెందడంతో ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు లేడన్న విషయం తెలుసుకుని తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



లాశ్విక్ (పాత చిత్రం)

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గోకవరం, సెప్టెంబరు 5: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల దుర్గాఅనిల్‌కుమార్ (21) పామాయిల్ గెలలు కోసేందుకు గురువారం తంటికొండ వచ్చాడు. తోటలో గెలలు నరికే క్రమంలో అనిల్‌కుమార్ చేతిలో ఉన్న గెడ ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై నేలపై కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు గమనించి అతడిని గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతిరోజూ చుట్టుపక్కల ఉండే పనులకు వెళ్లేవాడని... మొదటిసారిగా గురువారం తంటికొండ వచ్చి మృత్యువాతపడ్డాడని సహచర కూలీలు ఆసుపత్రి వద్ద విలపించడం స్థానికులను కలిచివేసింది. ఈ ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు సమాచారం.



మృతుడు అనిల్‌కుమార్




మోతుగూడెం-చింతూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు




రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టు

మన్యంలో వరుణుడి ప్రతాపం

మోతుగూడెం, సెప్టెంబరు 5: వరుణుడి ప్రతాపానికి మన్యం ఒక్కసారిగా అతలాకుతలమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం రాత్రి నుంచీ భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తెల్లవారుజామున నుంచే మోతుగూడెం-చింతూరు మార్గమధ్యంలో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాలు, అంబులెన్స్ రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ ప్రయాణికులు చాలా ఇబ్బందిపడ్డారు. తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.





డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

జీతాలు చెల్లించండి

మలికిపురం, సెప్టెంబరు 5: మలికిపురం ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు తమకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదంటూ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. తాము ఏళ్ల తరబడి ఈ కళాశాలలో అధ్యాపకులుగా, అధ్యాపకేతర సిబ్బందిగా పనిచేస్తున్నామని, ఈనెల 10వ తేదీలోపు తమకు జీతాలు చెల్లించక పోతే నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా కరస్పాండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు.

అలుపెరగని అక్షర కార్మికుడు గురువు



పి.గన్నవరం: ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ● ఘనంగా గురుపూజోత్సవం

పి.గన్నవరం, సెప్టెంబరు 5: సమాజంలో అలుపెరగని అక్షర కార్మికుడు గురువేనని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తల్లిదండ్రులు తరువాత గురువులనే దైవంగా భావించాలని విద్యార్థులకు సూచించారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీకళాశాలలో గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, కళాశాల వ్యవస్థాపకుడు ఎస్ఆర్‌జెప్రసాద్ దంపతుల చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు, కరస్పాండెంట్ శ్రీచరణ్‌లు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సంస్కృతిక కార్యక్రమాల్లో సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చిన నాటికను స్థానిక సీఐ ప్రశాంత్‌కుమార్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు యల్లమిల్లి కృష్ణవేణి, బండి మహలక్ష్మి, న్యూజెరూసలేం మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ డానియేలు, నంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, చెరుకూరి గోపాలకృష్ణ, సత్తిబాబు, యర్రంశెట్టి సాయిబాబు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అమలాపురం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అధ్యాపకులైన కేవీఆర్ఎస్ నరసింహారావు, కేఎస్‌వీఎస్ మనోహర్, కరాటం ప్రవీణ్, వైవరప్రసాద్, సీలి సంసోను, ఎం.సూర్యకుమారి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి తదితరులను సత్కరించారు. భాష్యం హైస్కూలులో జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువులకు విద్యార్థులు పాదపూజచేసి ఆశీర్వచనం అందుకున్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కిమ్స్ ఒకేషనల్ కళాశాలలో జరిగిన గురు పూజోత్సవంలో సామాజికవేత్త బండి రాధమ్మ పాల్గొనగా, డైరెక్టర్ కుడుపూడి జగదీష్, ఏవో కుడుపూడి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నామాడి సోమరాజు పాల్గొని గురువులను సత్కరించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణం, మండలంలో గురువారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కె.పాపాజీ, పి.విజయలక్ష్మి, జి.ఆర్.సి.కె.మోహన్‌లను ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకాబాబీ, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు సత్కరించారు. కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రెడ్నం, చిక్కాల స్వామికాపు, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంఈవో ఎం.శ్రీనివాస్, నాగేశ్వరి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. వీఎస్ఎం కళాశాలలో మంత్రి సుభాష్ నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌లో ఉపాధ్యాయులను మంత్రి సుభాష్ తండ్రి ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శాఖాధిపతులు, అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టరు పవన్‌కుమార్, ఏవో ఏఎస్‌వి రవిధర్, సీవోఈ రామారావు విద్యార్థులు పాల్గొన్నారు. వికాస్ జూనియర్ కళాశాలలో వేడుకలు ఘనంగా జరిపారు. బులుసు కల్యాణమండపంలో కరస్పాండెంట్ వి.వెంకటరమణ, ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మీబాయి, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

రాయవరం: మండల ప్రజాపరిషత్ సమావేశపు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితోపాటు ఎంఈవోలను, సీఆర్పీలను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ సీనియర్ నేత మేడపాటి రవీంద్రారెడ్డి గురువుల విశిష్టతను వివరించారు. మండలపరిషత్ వద్ద ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ప్రగతి రామారెడ్డి, కర్రిసందీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, పీడీ కె.ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఇరుసుమండలో కోనసీమ ఆహార నిధి నిర్వాహకుడు వీరంశెట్టి సతీష్ విద్యానిధి కళాశాల చైర్మన్ ఏబీ నాయుడు, ఆకెళ్ళ సత్కరించారు. పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, పెద్ద పాల్గొన్నారు.

కె.గంగవరం: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గురువులను సత్కరించి ఆశీస్సులు పొందారు. కోటిపల్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆంజనేయ నాగబాబు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో అబ్బురపరిచాడు. నాగబాబునుఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్రేయపురం: మండల పరిషత్ కార్యాలయంవద్ద 8మంది మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎంపీడీవో నాతి బుజ్జి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ఎంఈవోలు వరప్రసాదరావు, సాహెబ్ సత్కరించారు. ఆత్రేయపురం మండలం పులిదిండి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కారంకి సత్యనారాయణ అమలాపురంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఉపాధ్యాయ సంఘ నాయకులు సత్కరించారు.

మలికిపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాళ్లు గోదశి స్వామినాయుడు, ఆచంట ఆదినారాయణలను సత్కరించారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఇరుసుమండలో పనిచేస్తున్న బళ్ల మెహర్‌మూర్తిని రుద్రరాజు గోపాలకృష్ణరాజు, బ్యాంకుమేనేజర్ రాజారవిరామ్‌లు సన్మానించారు.

అంతర్వేది: సఖినేటిపల్లి రుద్రరాజు రామలింగరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యాకమిటీ చైర్మన్ కొండా కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి హెచ్‌ఎం కోలా వీరాస్వామిని సన్మానించి సత్కరించారు. ఈ సంవత్సరం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని విద్యాకమిటీ చైర్మన్ కిశోర్ కోరారు. అంతర్వేది దేవస్థానం, అంతర్వేది ఉన్నత పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి అలంకరించారు.

రాజోలు: మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురు పూజోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. రాజోలులో ప్రగతి సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో పొన్నమండ జిల్ల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పి.దీనాను సంస్థ అధినేత జె.ఊర్వశి దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పి.వాణి, ఆర్.దుర్గాలక్ష్మి, కె.గీత పాల్గొన్నారు.

ముమ్మిడివరం: బాలాజీ కాన్వెంట్ ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కాన్వెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎస్ శాస్త్రి, కరస్పాండెంట్ పి.సుజాతలు పాల్గొన్నారు. తారా కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ జీవీకే సుమంత్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు వెంకటలక్ష్మి, అశ్విని, శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ముమ్మిడివరం మహిళా కళాశాలలో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, రావుబహదూర్ రఘుపతివెంకటరత్నంనాయుడు డిగ్రీ మహిళా కళాశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి పాల్గొన్నారు. అయినాపురం జడ్పీ హైస్కూలులో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ మోకా రామారావు, హెచ్‌ఎం తాడి కృష్ణారెడ్డి, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాససూర్యవెంకటగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులచే కేక్ కట్‌చేయించి గురువులను సన్మానించారు. కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్‌ను, ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించి గురుపూజోత్సవం జరిపారు.

ఆలమూరు: సిద్ధార్థ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవంలో స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావును విద్యార్థులు ఘనంగా సత్కరించారు. మండలంలోని పలు పాఠశాలలో విద్యార్థులు గురువులను సత్కరించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి 1990-91 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు పూలమాలలు వేసి ఉపాధ్యాయులను సత్కరించి స్వీట్స్ పంపిణీ చేశారు.

యానాం: యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలోని చిల్డ్రన్స్ ఆడిటోరియంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామిలు హాజరయ్యారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. వివిధ పోటీలలో ప్రతిభ సాధించిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. యానాం మహారాష్ట్ర బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యాశాఖధికారి లక్ష్మణప్రవీణ్, విశ్రాంతి ఉపాధ్యాయురాలు బి.సాయి జానకీలను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు జి.సూధకార్, సాయిరామ్ క్రిష్ణ, గంగాదర్, సురేష్‌కుమార్, వెంకటసురేష్ పాల్గొన్నారు. పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో యానాంకు చెందిన ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్‌పీఎస్ఎన్ ఆచార్యులు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ముఖ్యమంత్రి రంగసామి, విద్యాశాఖ మంత్రి నమశ్శివాయః నుంచి అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడం పట్ల ఆచార్యులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, విద్యాశాఖధికారితో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాసా స్వయంప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టీచర్స్ డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, కళాశాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భట్నపాలెం ఏవీఎస్ఎన్ జూనియర్ కళాశాల, అమృత ఇంగ్లీష మీడియం పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రముఖ కవి, ఆంధ్రోపన్యాసకుడు నల్లా నరసింహమూర్తిని, కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, ఉపాధ్యాయుడు అడపా గోపాలకృష్ణను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుర కృపానందం, ఇంగ్లీషు మీడియం స్కూల్ హెచ్‌ఎం నల్లా సరస్వతీదేవి, సింహాచలం, విజయ, స్వరూప, హరిత, శ్యామల, సదాలక్ష్మి, మోహన్‌కుమార్, నిమ్మకాయల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

కొత్తపేట: వాడపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ గోవిందస్వామి ఆధ్వర్యంలో గురువులను సత్కరించారు. కార్యక్రమంలో కరిబండి సుబ్బారావు, విద్యాకమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న గిడ్డి సత్యనారాయణ, మండల పరిధి మోడేకుర్రు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న కుసుమ ఆనందరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను కలెక్టర్ చేతులు మీదుగా అందుకున్నారు. వారిని గురువారం ఎంఈవో కార్యాలయంలో సత్కరించారు.

అల్లవరం: కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావుపంతులు జడ్పీ హైస్కూలులో సీనియర్ పాత్రికేయుడు నడింపల్లి సీతారామరాజు ఆధ్వర్యంలో పదహారు మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మంగళంపల్లి సత్యనారాయణమూర్తి, ఆకుల వీరాంజనేయులు, కడలి త్రిమూర్తులు, కాట్రు గ్రేస్‌ప్రేమలత, కోరుమిల్లి సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు. గోడితిప్ప ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ కొల్లు వేణుగోపాల్ అధ్యక్షతన ఉపాధ్యాయులను సన్మానించారు. కొల్లు త్రినాథవర్మ, హెచ్‌ఎం ముత్యాల నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లి: కె.జగన్నాథపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను వివేకానంద సేవాసమితి ప్రతినిధి గనిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ ముఖ్యఅతిథిగా హాజరై రాధాకృష్ణచిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. మల్లాది మల్లిబాబు, శ్రీకాకొళపు రాధాకృష్ణ, నల్లా మణికంఠ, యనమదల వెంకటరమణ, హెచ్‌ఎం జి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

● భయాందోళనలో లంక గ్రామాలు




అయినవిల్లిలంక కాజ్‌వే పైకి వస్తున్న వరద

అయినవిల్లి, సెప్టెంబరు 5: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గౌతమీ, వృద్ధగౌతమి పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి, లంక పొలాలను వరదనీరు ముంచెత్తుతుంది. అయినవిల్లి ఎదురుబిడియం వద్ద వరద నీరు కాజ్‌వేపై ప్రవహిస్తోంది. మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో తీర ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముక్తేశ్వరంలో పాత వంతెన నీట మునిగింది.

పెరుగుతున్న గోదావరి వరద

ఆత్రేయపురం: కాటన్ బ్యారేజీవద్ద గోదావరి వరద పెరుగుతోంది. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లంక గ్రామాల్లో పశు సంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతులకు అధికారులు సూచించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చర్యలు చేపడుతున్నారు. బ్లీచింగ్ చల్లి, ఇంటింటికీ వైద్య బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. ఎంపీడీవో నాతి బుజ్జి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి చర్యలు చేపడుతున్నారు.



అప్పనపల్లి స్నానాల రేవు వద్ద పరవళ్లు తొక్కుతున్న వైనతేయ నది

మామిడికుదురు: గోదావరికి క్రమేణా వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు వద్ద వైనతేయ నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. అదేవిధంగా అప్పనపల్లి కాజ్‌వేవద్ద ఉన్న ఇటుక బట్టీలు వరద ప్రవాహంలో మునిగాయి. వరద కాజ్‌వేపైకి చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధానంగా లంక గ్రామాలైన బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంక, పాశర్లపూడిలోని పల్లవపాలెం, శ్రీరాంపేట తదితర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కపిలేశ్వరపురం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలంవద్ద గోదావరి నది పోటెత్తడంతో లంకగ్రామాల్లో తిరిగి వరద ప్రవాహం పెరిగింది. దీంతో లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, ఆద్దంకివారిలంక గ్రామాల్లోని అరటి, బెండ, వంగ, కంద, బీర, తదితర కూరగాయ పంటలు వరదనీటిలో చిక్కుకున్నాయి. తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి పుష్కరఘాట్‌ల వద్ద వరద ఉధృతి పెరిగింది. కోరుమిల్లి లంకలో వేసిన పంటలు పూర్తిగా నీటమునగడంతో అవి పనికిరాకుండా పోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఐ.పోలవరం: గోదావరికి వరద పెరగడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ప్రభావిత గ్రామాలైన గోగుల్లంక, భైరవలంక, పల్లిగూడెం, జాంబవానిపేట, పుగాకులంక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల రైతులు సైతం భయపడుతున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది.

పెరుగుతున్న వైనతేయ వరద

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెం వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ ఎస్వీవీ నరసింహారావు, ఎంపీడీవో జీఎస్వో కృష్ణమోహన్ పరిశీలించారు. పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ వద్ద సమావేశం నిర్వహించి వైనతేయ ఏటిగట్టుకు గండ్లు పడకుండా చూడాలని ఆదేశించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, చింతా శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీను, వీఆర్వో మాచిరాజు ఉల్లీస్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందించండి

● ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ● వరదబాధితులకు ఆపన్నహస్తం



ముమ్మిడివరం: విజయవాడలో పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు



రావులపాలెం నుంచి నిత్యావసరాలు తరలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ముమ్మిడివరం, సెప్టెంబరు 5: విజయవాడలో వరద ముంపు బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు తరలిరావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడంతో ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో పలువురు విజయవాడ తరలివెళ్లారు. గత మూడు రోజులుగా విజయవాడలో ఉండి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుని వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ కార్యదర్శి గుత్తుల సాయి, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావులతో పాటు పలువురు ఉన్నారు.

అమలాపురం టౌన్: విజయవాడ వరద బాధితులకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జాయింట్ కలెక్టర్ అశోక్‌లతో కలిసి గురువారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వివిధ ప్రాంతాల్లో పర్యటించి సాయం అందించారు. పొలమూరి ధర్మపాల్, మహాదశ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు లక్ష రూపాయల చెక్కు అందజేత

రాయవరం: విజయవాడ వరద బాధితులకు సహాయం అందించేందుకు రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ కుటుంబ సభ్యులు విజయదుర్గా సేవాసమితి తరపున గురువారం లక్ష రూపాయల విరాళాన్ని విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. తొలుతగా విజయదుర్గా పీఠం నుంచి బస్సుల్లో వరద బాధితులకు అందించేందుకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, మంచినీరు బాటిళ్లు, బిస్కెట్లు విజయవాడ తీసుకువెళ్లి 5వేల మంది వరద బాధితులకు పంపిణీ చేశారు. సేవాసమితి ప్రతినిధులను సీఎం అభినందించారు. సేవా సమితి ప్రతినిధులు, గాదే సత్యవెంకట కామేశ్వరి భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, వాడ్రేవు సీతారమ్య, గాదే కృష్ణవేణి, బలిజేపల్లి నాగవైష్ణవి దివ్య, 15 మంది పీఠం వలంటీర్లు పాల్గొన్నారు.

వరదబాధితులకు రూ. 50వేలు విరాళం

కె.గంగవరం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కె.గంగవరానికి చెందిన శ్రీదేవి ఫెర్టిలైజర్స్ అధినేత నేమాని సత్యనారాయణ(పిండికొట్టు సత్తిబాబు) రూ.50వేలు విరాళం ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50వేలు జమచేశారు.

ఆత్రేయపురం: విజయవాడ వరద బాధితులకు ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన జనసేన ఎన్ఆర్ఐ యేపుగంటి సత్యసాయిబాబా సొంత నిధులతో సమకూర్చిన 5వేల వాటర్‌బాటిల్స్, చీరలు, ఆహారం, నిత్యావసర సరుకులను గురువారం వాడపల్లిలోని స్వగృహం నుంచి విజయవాడ పంపించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు సరుకుల వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఎన్ఆర్ఐ సాయిబాబును పలువురు అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బండారు బాబి, కాకులపాటి సత్య, ముదునూరి సుబ్బరాజు, పైడికొండల నారాయణరావు, శేషారావు, యేపుగంటి సుబ్బారావు, బుద్ధుడు పాల్గొన్నారు.

రూ.10లక్షల విలువైన నిత్యావసరాలు తరలింపు: ఎమ్మెల్యే బండారు

రావులపాలెం: విజయవాడ వరద బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. విజయవాడ వరద బాధితులకు అందించేందుకు గురువారం రూ.10 లక్షలు విలువైన పది టన్నుల బియ్యం, ఏడు టన్నుల కూరగాయలు, పదివేల వాటర్ బాటిళ్లు, 20వేల వాటర్ ప్యాకెట్లు, 2వేల పాల ప్యాకెట్లు లారీలో తరలించారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం నుంచి తరలిస్తున్న ఈ లారీని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన రైసు మిల్లర్స్ అసోసియేషన్, మడికి కూరగాయల మార్కెట్ అసోసియేషన్, ఇటుక బట్టీ యూనియన్‌ను అభినందించారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్, ఈదల నల్లబాబు, గుత్తుల పట్టాభిరామారావు, కోటవెంకటేశ్వరరావు, పెచ్చెట్టి చిన్నారావు, కేతా శ్రీను, సవరపు శ్రీను, వాసంశెట్టి రామకృష్ణపాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్షా ఆరువేల విరాళం

ఆలమూరు: విజయవాడవరద బాధితులకు ఆలమూరు ఇటుకల పరిశ్రమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్షా 6వేల విలువగల వస్తువులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అందించారు. వరద బాధితులకు ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో 2వేల పాలప్యాకెట్లు, వెయ్యివాటర్ బాటిల్స్‌తోపాటు వివిధ వస్తువులను అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, నాయకులు రామానుజుల శేషగిరిరావు, తమలంపూడి కృష్ణారెడ్డి, జాస్తి చిన్ని, చీపురుపల్లి గణేష్, నల్లా సత్తిబాబు, చల్లా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు శేషారావు రూ.2లక్షలు ఆర్థిక సాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురంనకు చెందిన పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.2లక్షలు సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఎంఎస్ఆర్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ తరపున సదరు మొత్తం చెక్కును గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు శేషారావు, ఆయన సోదరులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, వెంకట రమణ, కృష్ణ అందజేశారు.

వరద సాయంపై సీఎం అభినందన

కొత్తపేట: కొత్తపేట నియోజకవర్గం నుంచి విజయవాడ వరద బాధితులకు గురువారం బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ స్వయంగా వెళ్లి సాయం అందించారు. వరద బాధితులకు బియ్యం, తాగునీరు, పాలు, కూరగాయలు పంపిణీ చేసి అనంతరం సీఎం చంద్రబాబును కలిశారు.

అమలాపురంటౌన్: అలాగే అమలాపురంలో మీడియా ప్రతినిధి టీకే విశ్వనాథ్ గురువారం రూ.25 వేలు విరాళాన్ని అందించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి చెక్కును అందజేయగా ఆయన్ను అభినందించారు.

అంతర్వేది గోశాలకు టన్ను దాణా వితరణ

అంతర్వేది, సెప్టెంబరు 5: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి గోశాలకు అప్పనరామునిలంకకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దివ్వి శ్రీనివాస్ 24 బస్తాల దాణా వితరణ చేశారు. సుమారు టన్ను ఉన్న ఈ దాణాను వీరా పండు రవాణా సదుపాయంతో గోశాలకు చేర్చారు. అర్చకులు రాజ్‌కుమార్‌శర్మ, సేవకులు బెల్లంకొండ సూరిబాబు, వీరా పండు, రావి ప్రసాద్, నరసింహ, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

అడవిపాలెంలో పంచాయతీ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

మలికిపురం, సెప్టెంబరు 5: మండల పరిధిలోని అడివిపాలెం గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడింది. గతంలో ఈ పంచాయతీ శంకరగుప్తంలో కలసి ఉండేది. శంకరగుప్తం పంచాయతీ నుంచి అడవిపాలెం పంచాయతీ ఏర్పడిన తరువాత సర్పంచ్‌గా కొల్లు అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో అదే గ్రామంలో ఉన్న ఎస్సీ సామాజిక భవనంలో పంచాయతీని కొనసాగిస్తున్నారు. ఈ సామాజిక భవనం గ్రామ పంచాయతీకి చెందిన సర్వే నంబరు 545/5లో 196 సెంట్లు పంచాయతీ స్థలంగా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఇదే స్థలంలో అదే గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు రూ.20లక్షలు మంజూరు చేయగా ఈ పంచాయతీకి చెందిన స్థలంలోనే అప్పుడు సామాజిక భవనం నిర్మించారు. ఆ సామాజిక భవనాన్ని ఎస్సీ సామాజిక వర్గీయులు తమ కార్యక్రమాలకు ఉపయోగిస్తుండగా నూతనంగా ఏర్పడిన పంచాయతీకి భవనం లేకపోవడంతో ఈ సామాజిక భవనంలో పంచాయతీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంచాయతీకి చెందిన 196 సెంట్లలో ఇంకా మిగులు భూములు ఉండడంతో ఆ ప్రాంతంలో పంచాయతీ నూతన భవనం నిర్మించడానికి ఇటీవల జరిగిన గ్రామసభలో పంచాయతీకి చెందిన 196 సెంట్లను సర్వే చేయాలని తీర్మానంచేసి చలానా కట్టారు. అయితే ఇప్పటికే చాలా స్థలాన్ని అదే గ్రామానికి చెందిన పలువురు పేదలు, ధనికులు ఆక్రమించుకుని భవనాలు నిర్మించారు. వారు ఈ పంచాయతీ స్థలాన్ని సర్వే చేయడం కుదరదని అడ్డగించారు. దీంతో ఎస్సీ సామాజికవర్గానికి, సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి నరసింహస్వామి వర్గీయులకు మధ్య వివాదం ఏర్పడి ఘర్షణ జరిగింది. సంఘటన స్థలంలో ఇరు వర్గాలకు చెందిన అధిక సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో పరిస్థితి విషమించింది. అక్కడకు చేరిన సీఐ టీవీ సురేష్‌కుమార్, ఎస్ఐ జి.సురేష్‌లు ఇరువర్గాలను చెదరగొట్టారు. సామాజిక భవనంలో ఇరు వర్గాలకు చెందిన కొంతమందితో కలిపి సీఐ సురేష్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ సీఎస్ రాజులు చర్చలు జరిపారు. చర్చలు సర్వే కుదరదని ఒక వర్గం, సర్వే చేయాలని మరోవర్గం పట్టుబట్టడంతో సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. మరో దఫా మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేస్తామని వాయిదా వేశారు. ఈ చర్చల్లో కొల్లు నరసింహస్వామి, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కందికట్ల నిర్మల, నల్లి సత్యనారాయణరావు, రామకృష్ణ, రాపాక మనసే, గెడ్డం నాగభూషణం, శశికుమార్ పాల్గొన్నారు.

ద్వారపూడిలో పోలీసు పహారా

● గ్రామంలో 144 సెక్షన్ అమలు

మండపేట, సెప్టెంబరు 5: మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో రెండు సామాజికవర్గాల మధ్య విగ్రహాల ఏర్పాటులో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు 144 సెక్షన్ విధించినట్టు మండపేటరూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపారు. ఇప్పటికే రెండు సామాజికవర్గాలు సమన్వయం పాటించాలని కోరామని శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో బస్టాండ్‌వద్ద డాక్టర్ బాబా సాహెబ్, వంగవీటి రంగా విగ్రహాల ఏర్పాటులో వివాదం చోటు చేసుకుంది. ఇరువర్గాలతో చర్చలు జరిపేందుకు బుధవారం రామచంద్రపురం ఆర్డీవో, డీఎస్పీలు వచ్చినప్పటికీ చర్చలు జరగలేదు. డీఎస్పీ రామకృష్ణ గ్రామంలో పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ పోలీసుశాఖలు గ్రామంలో నెలకొన్న పరిస్థితులు అదుపులోకి వచ్చేవరకు నిషేధాజ్ఞలు అమలు చేయాలని నిర్ణయించారు. గ్రామంలో సభలు సమావేశాలు ప్రజలు గుమిగుడి ఉండకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు బలగాలు గ్రామంలో మోహరించాయి. బుధవారం అర్ధరాత్రి ఓవర్గం వివాదాస్పద స్థలంలో విగ్రహం ఏర్పాటుకుచేసిన ప్రయత్నంను పోలీసులు వమ్ము చేశారు. ప్రస్తుతంపరిస్థితి అదుపులో ఉందని ప్రజలు శాంతిభద్రతల విషయంలో తమకు సహకరించాలని రూరల్ సీఐ దొరైరాజు కోరారు. సర్కిల్ పరిధిలోగల మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు, పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి పోలీసు బందోబస్తు నిర్వస్తున్నారు.

'ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి'

అంబాజీపేట, సెప్టెంబరు 5: జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి సూచించారు. మండలంలోని కె.పెదపూడిలో గురువారం ఆమె పర్యటించారు. డెంగ్యూ నిర్ధారణ అయిన వారికి పూర్తిస్థాయిలో చికిత్స అందించాలన్నారు. అవసరమైనవారికి పీహెచ్‌సీల్లో రక్తపరీక్షలు చేయాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా ఆపరేషన్‌ను పంచాయతీ అధికారుల సహకారంతో నిర్వహించాలన్నారు. వైద్యాధికారి ఇంద్రావతి, సూపర్‌వైజర్ రాధా నరసింహం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైద్యాధికారి కేవన్ శ్రీనివాస్‌లు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సి ఉండగా కేవలం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి మాత్రమే హాజరయ్యారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు నాయీబ్రాహ్మణుల పాలాభిషేకం

ఆత్రేయపురం, సెప్టెంబరు 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు గురువారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కేశఖండన శాలవద్ద పాలాభిషేకం నిర్వహించారు. రూ.25 వేలకు వేతనం పెంపుదల చేయడంతో క్షౌరవృత్తిదారులంతా సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు యేపుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

ఐ.పోలవరం, సెప్టెంబరు 5: విశాఖకు చెందిన సీతంరాజు శివరామకృష్ణ దంపతులు వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు గురువారం రూ.50వేలు విరాళం ఆలయ పర్యవేక్షణాధికారికి అందించారు. దాతలను అర్చకులు ప్రసాదం, స్వామి చిత్రపటం బహూకరించి సత్కరించారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి'

ముమ్మిడివరం, సెప్టెంబరు 5: ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న కంట్రీబ్యూషన్ పెన్షన్ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో అధ్యాపకులు కె.చిట్టిబాబు, జీబీవీ పద్మనాభ్, కులకర్ణి సురేష్‌రావు, డి.పల్లంరాజు, ఎన్.తులసిలక్ష్మి, టి.ప్రభాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్‌తో విలువైన భూములు కోల్పోతున్నాం

● మా మొర ఆలకించండి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5: కొత్త రైల్వేలైన్ నిర్మాణం వల్ల విలువైన భూములతో పాటు ప్రజావసరాలను తీర్చే ఎన్నింటినో కోల్పోతున్నామని వివిధ గ్రామాలకు చెందిన రైతులు గురువారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పాత రూట్ మ్యాప్‌లోనే రైల్వేలైన్ నిర్మించాలని వేడుకుంటున్నారు. మా మొర ఆలకించి తమ గోడును ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. కొత్తగా ప్రతిపాదించిన రైల్వేలైన్‌వల్ల చిందాడమడుగుతో పాటు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంచినీటి చెరువు కనుమరుగు అవుతుందని జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. తమ భూములు రైల్వేలైన్‌కు తీసుకోవద్దని గ్రామ సభల్లో పంచాయతీల ద్వారా తీర్మానం చేయించినట్టు తెలిపారు. విలువైన భవనాలతో పాటు టౌన్ ప్లానింగ్ ఆమోదించిన లేఅవుట్ల సైతం ఉన్నాయని వివరించారు. పాత రూట్ మ్యాప్‌లోనే రైల్వేలైన్ నిర్మించి విలువైన భూములను కాపాడాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి చిందాడగరువు, భట్నవిల్లి, రోళ్లపాలెం, కామనగరువు, ఇమ్మిడివరప్పాడు, పేరూరు, బోడసకుర్రు ప్రాంతాలకు చెందిన రైతులు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే జాతీయ రహదారి కోసం భూములను కోల్పోయామని తెలిపారు. గ్రామాల్లో అభ్యంతరాలను అధికారులు స్వీకరించాలని కోరారు. రైతు ప్రతినిధులు రాజులపూడి వెంకటేశ్వరరావు, ఉర్రింక రమేష్, రంకిరెడ్డి అబ్బులు, దాసం సురేష్, మట్టా సాయిరామారావు, రాజులపూడిభాస్కరరావుపాల్గొన్నారు.

రాములోరి కోదండానికి పూజలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5: అయోధ్యలో రాములోరికి సమర్పించే కోదండం (విల్లు) భక్తుల సందర్శనార్థం గురువారం అమలాపురం చేరుకుంది. భక్తుల సహాయ సహకారాలతో కోదండాన్ని తయారుచేయించినట్టు చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. 13 కిలోల వెండి, కిలో బంగారంతో రాములోరి కోదండాన్ని చెన్నైలో ప్రత్యేకంగా తయారు చేయించినట్టు ఆయన తెలిపారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలోని రాములోరి ఆలయం వద్ద నుంచి కోదండాన్ని ప్రత్యేక గృహానికి తరలించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ప్రస్తుతం అయోధ్యలో రోజుకు 500 నుంచి వెయ్యి మంది భక్తుల వరకు ఆంధ్రా భోజనాన్ని అన్నదానంగా అందిస్తున్నామని వివరించారు. త్వరలోనే శ్రీలంకకు కూడా భక్తుల సందర్శనార్థం కోదండం తీసుకువెళతామన్నారు. అయోధ్యకువెళ్లే భక్తులు చల్లా శ్రీనివాసశాస్త్రి సెల్ 9550754389 సంప్రదించవచ్చునన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 5: రామచంద్రపురం పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆసాని తాతారావుకు ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ నాయక్ 15 రోజులు జైలుశిక్ష విధించినటు సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.